క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే



ఒంగోలు సిటీ: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని తాడేపల్లిలో మాజీ ఎమ్మెల్యే కనుకుర్తి ఆదెన్న మర్యాద పూర్వకంగా గురువారం కలిశారు. అనంతరం జగన్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

వేడుకగా సత్యసాయి బాబా ఆరాధన

ఒంగోలు మెట్రో: భగవాన్ సత్యసాయి బాబా ఆరాధన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. గురువారం నగరంలోని మంగమూరు రోడ్డు జెడ్పీ కాలనీలో సత్యసాయి బాబా మందిరంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, ఆలయ కన్వీనర్ కోడెల శ్రీనివాసరావు అన్న సంతర్పణ చేశారు.

పోషకాహారం, ఆరోగ్యంపై అవగాహన



విద్యార్థుల ఎత్తు పరిశీలిస్తున్న సిబ్బంది

ఒంగోలు సిటీ: పౌష్టికాహారం తీసుకోవడం వలన శారీరక ఆరోగ్యంతో పాటు మానసికంగా దృఢంగా ఉంటారని క్విస్ విద్యాసంస్థల అధినేత డాక్టరు సూర్య కళ్యాణ్ చక్రవర్తి పేర్కొన్నారు. గురువారం ఒంగోలు క్విస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో పోషక్ పక్వాడా వారోత్సవాలు నిర్వహించారు. మొదటి రోజు విద్యార్థులకు పోషకాహారంపై సెమినార్ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ విద్యార్థులు వెంగముక్కలపాలెంలో పర్యటించి ప్రజలకు పోషకారంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ మంచి ఆహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ డాక్టర్ శ్రీగాయత్రి అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ హనుమంతరావు, ఎన్ఎస్ఎస్ డీన్ డాక్టర్ నవనీత కృష్ణన్, శిరీష, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎస్పీ బాలు చిరస్మరణీయుడు



ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సురేష్

చీమకుర్తి: సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం చిరస్మరణీయుడని ప్రముఖ సంగీత విద్వాంసులు మాదవపెద్ది సురేష్ పేర్కొన్నారు. బాలు విగ్రహాన్ని గురువారం రాత్రి చీమకుర్తిలో ఆయన చేతుల మీదుగా ఆవిష్కరించారు. చీమకుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని అభయ సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాధవపెద్ది సురేష్ మాట్లాడుతూ ప్రముఖ సినీ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహాన్ని తన చేతుల మీదుగా ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. నిర్వాహకులు మాధవరావును అభినందించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపురపు రాజ్యలక్ష్మి, చలువాది బదరీనారాయణ, నూనె సుబ్రహ్మణ్యం, గోపురపు చంద్ర, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రం ప్రారంభం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని గణేష్‌నగర్ సచివాలయ భవనం ఆవరణలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. తహసీల్దార్ ఎం.ఆంజనేయరెడ్డి, కమిషనర్ ఐ.శ్రీనివాసులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు

నిలకడగా ఈదర హరిబాబు ఆరోగ్యం

ఒంగోలు టౌన్: మాజీ ఎమ్మెల్యే ఈదర హరిబాబు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఆయన మేనల్లుడు, సంతనూతలపాడు టీడీపీ నాయకుడు వీరయ్య చౌదరి హత్య జరగడంతో హరిబాబు గుండెపోటుకు గురవడం తెలిసిందే . జీజీహెచ్ వద్దకు వచ్చిన తరువాత ఆయనకు గుండెపోటుకు గురయ్యారు. వెంటనే నగరంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. సీరియస్‌గా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం సౌత్ బైపాస్ లోని ఒక కార్పొరేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నట్లు సమాచారం.

పంచాయతీలను అభివృద్ధిలోకి తీసుకురావాలి



కొత్తపట్నంలో మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీకృష్ణ



అవార్డు అందుకుంటున్న చంద్రపాలెం సర్పంచ్ రామారావు

- ఘనంగా జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం

కొత్తపట్నం: ప్రతి పంచాయతీ అభివృద్ధి చెందినప్పుడే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటాయని ఎంపీడీవో శ్రీకృష్ణ అన్నారు. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో గురువారం వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి చెందాలంటే గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం సక్రమంగా ఉండాలన్నారు. ఇంటి పన్నులు వంటి పనులు సక్రమంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యమన్నారు. పంచాయతీకు సంబంధించిన వనరులు సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. గ్రామ పంచాయతీల భూములు, ప్రాంగణాలు, ఆస్తులను దుర్వినియోగం చేయకూడదని, వాటిని సక్రమంగా ఉపయోగంలోకి తీసుకొచ్చిన రోజే పంచాయతీలు అభివృద్ధి చెందుతాయన్నారు. అనంతరం మహాత్మ గాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులలర్పించారు. కార్యక్రమంలో ఏవో బి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

చీమకుర్తి రూరల్: మండలంలో పలు పంచాయతీల్లో జాతీయ పంచాయతీ దినోత్సవం సచివాలయాల సిబ్బంది ఘనంగా నిర్వహించారు. గురువారం పడమటి నాయుడుపాలెం, తొర్రగుడిపాడు, బండ్లమూడి సచివాలయాల సిబ్బంది పడమటి నాయుడుపాలెంలో జాతీయ పంచాయతీ దినోత్సవంలో ముందుగా మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి మాజీ సర్పంచ్ కరుణాకర్‌రెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బొంతా కరుణప్రియ, వెంకటలక్ష్మి, పంచాయతీ సెక్రటరీ శంకర్, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సర్పంచ్‌గా చంద్రపాలెం సర్పంచ్..

సంతనూతలపాడు: పలు రంగాల్లో ఉత్తమ సేవలు, గ్రామాభివృద్ధికి పాటుపడిన చంద్రపాలెం సర్పంచ్ బొడ్డు రామారావు ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకున్నారు. ఈ మేరకు ఉత్తమ స్థానిక నాయకత్వ సేవా పురస్కార్ అవార్డు అందుకున్నారు. ఒంగోలులోని మల్లయ్య లింగం భవన్‌లో గురువారం జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం నిర్వహించారు. రామారావుకు ఒంగోలు నగరపాలక కార్పొరేషన్ మేయర్ గంగాడ సుజాత, రాష్ట్ర టూరిజం శాఖ చైర్మన్ నూకసాని బాలాజీలు అవార్డును అందజేశారు. గ్రామస్వరాజ్ సాధన సమితి, నేషనల్ లోకల్ ప్రభుత్వ చాంబర్ జాతీయ కార్యదర్శి జి. వీరభద్రచారి జాతీయ పంచాయతీరాజ్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో కార్యదర్శి మౌనిక, సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ పంచాయతీ దినోత్సవం జరుపుతున్న ఉద్యోగులు

వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ అంజమ్మ కృష్ణారెడ్డి



వీరయ్య చౌదరి మృతికి సంతాపం ప్రకటిస్తున్న ఎంపీపీ, అధికారులు

నాగులుప్పలపాడు: గ్రామాల్లో వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చూడాలని ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అంజమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కొన్ని శాఖలకు సంబంధించి సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్‌కు సంబంధించి పల్లెపండగలో భాగంగా రహదారులు నిర్మించారన్నారు. కొన్ని గ్రామాల్లో సైడు కాలువలు నిర్మించాల్సి ఉందని పీఆర్ ఏఈ వీరాంజనేయులు తెలిపారు. పోషణ్ పక్వాడా ద్వారా పోషకహారంపై పక్షోత్సవాలు నిర్వహించి అవగాహన కల్పించినట్లు అంగన్‌వాడీ సూపర్ వైజర్ ఉషారాణి తెలిపారు. పాఠశాలలో వందశాతం ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయడానికి కృషి చేస్తున్నట్లు ఎంఈవో రవి చెప్పారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన వారికి మండల పరిషత్ ద్వారా ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామని ఏవో దక్షిణామూర్తి తెలిపారు. తదుపరి కొన్నిశాఖల వారీగా సమీక్షించారు. అనంతరం మాజీ ఎంపీపీ వీరయ్యచౌదరి మృతికి సంతాపం తెలిపారు. ఎంపీడీవో వై మహాలక్ష్మి మాట్లాడుతూ కార్యదర్శులు పారిశుధ్యంపై నిర్లక్ష్యం వహించరాదన్నారు. 2021 నుంచి 2026 వరకు ఉన్న మండల పరిషత్ పాలకవర్గం సభ్యుల వివరాలతో కూడిన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బూచేపల్లిని కలిసిన పార్టీ శ్రేణులు



వెంకాయమ్మ, శివప్రసాదరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

చీమకుర్తి: వైఎస్సార్ సీపీ పదవులు పొందిన నాయకులు గురువారం చీమకుర్తిలోని బూచేపల్లి నివాసంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను మర్యాద పూర్వకంగా కలిశారు. మండల స్థాయిలో పార్టీ పదవులు పొందిన వారిలో వాణిజ్య విభాగం అధ్యక్షులు ఉప్పలపాటి వెంకట్రావు, మండల జనరల్ సెక్రటరీ పొన్నపల్లి నాగేశ్వరరావు ఉన్నారు. వారు బూచేపల్లి వెంకాయమ్మ, బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు, మండల రూరల్ అధ్యక్షులు పమిడి వెంకటేశ్వర్లు, నల్లూరి రామచంద్రారావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

భూ యజమానుల నిర్వాకం

కురిచేడు: స్థానిక వినుకొండ రోడ్డులోని ఎస్ఎస్‌పీ కాలనీ- హెచ్‌పీ పెట్రోల్ బంకు మధ్యలో భూయజమానులు తరుచూ డ్రైనేజీకి మట్టి అడ్డుకట్ట వేస్తుండటంతో రోడ్డు బురదమయమై ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని మురుగు ఈ డ్రైనేజీ నుంచి వెంగాయపాలెం బీసీ కాలనీ వద్ద వాగులోకి చేరుతుంది. భూములను రియల్ ఎస్టేట్‌గా మార్చుకునేందుకు డ్రైనేజీకి మట్టి అడ్డుకట్ట వేయడంతో మురుగు రోడ్డుపైకి చేరుతోంది. గతంలో అనేక సార్లు ఇలాగే చేయడంతో పడమరవీరాయపాలెం పంచాయతీ సర్పంచ్, కార్యదర్శి బొరిగర్ల శివలక్ష్మి, జగన్‌మోహనరెడ్డిలు డ్రైనేజీకి అడ్డుకట్టగా ఉన్న మట్టిని తొలగించి మురుగు వెళ్లేలా చేశారు. మళ్లీ అడ్డుకట్ట వేయడంతో పంచాయతీ కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ప్రభుత్వ డ్రైనేజీని ఆక్రమించేందుకు మళ్లీ డ్రైనేజీకి మట్టి అడ్డు వేసిన వారిపై చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.

వక్ఫ్ సవరణ బిల్లుపై అపోహలు విడనాడాలి

పొదిలి రూరల్: పేద ముస్లింలకు మంచి చేసేందుకు ప్రభుత్వం వక్ఫ్ సవరణ బిల్లు తీసుకొచ్చిందని, దీనిపై కొందరు భయాందోళనలు రేకెత్తిస్తున్నారని, ప్రజలు అటువంటి అపోహలు విడనాడాలని బీజేపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు షేక్ బాజీ అన్నారు. గురువారం పొదిలి సాయి కళ్యాణ మండలంలో వక్ఫ్ బిల్లు సవరణపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. బాజీ మాట్లాడుతూ వక్ఫ్ భూముల అభివృద్ధి కోసం చట్టబద్ధంగా ముందడుగు వేసిందని, ఎక్కడా స్వలాభాలు, రాజకీయ కోణాలు లేవన్నారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతరులకు చోటులేదని, కేవలం ముస్లింల ఓటు బ్యాంకు కోసమే ఇలాంటి తప్పుడు ప్రచారాలు ప్రతిపక్షాలు చేస్తున్నాయన్నారు. మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య, జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసులు, ముస్లిం మైనార్టీ మహిళా మోర్చా అధ్యక్షురాలు షబానా పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



భక్తులకు అన్నదానం



చట్టమిట్లలో పల్లకిలో ఊరేగిస్తున్న సాయిబాబా

పెద్దారవీడు: మండలంలోని చట్లమిట్ల శిరిడీ సాయిబాబా మందిరంలో వార్షికోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు కల్లూరి చిన్న త్రిపురాంతకుడు ఆధ్వర్యంలో ఉదయం గణపతి పూజలు, ప్రాతఃకాల పూజలు, పుణ్యాహవాచనం, ప్రధాన కలశ స్థాపన, శ్రీ సాయి బాబాకు ప్రత్యేక పూజలు, జప హోమాదులు, క్షీరాభిషేకం, సహస్రనామ పుష్పార్చనలు, మంత్ర పుష్పం, సాయంత్రం సాయంకాల పూజలు, జపాదులు, స్వస్తి, హారతి, మంత్ర పుష్పం తదితర పూజలు చేశారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు భారీగా భక్తులకు అన్నదానం, సాయంత్రం పల్లకిలో ద్వారకామాయి బాబా విగ్రహం గ్రామం వీధుల్లో భక్తి పాటలతో భజనలు చేసుకుంటూ ఊరేగించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి



పొదిలిలో నిర్వహిస్తున్న ర్యాలీ

పొదిలి రూరల్: జమ్ము కశ్మీర్‌లో పహల్గాంలో పర్యాటకులను కాల్చి చంపిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా అధ్యకుడు షేక్ బాజీ అన్నారు. గురువారం ఉగ్రదాడికి నిరసనగా పొదిలి పెద బస్టాండ్ నుంచి చిన బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముష్కరులు మతద్వేషంతో హిందూ పర్యాటకులను కాల్చి చంపడం దారుణమన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా ఉండాలంటే ఉగ్రవాదులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. దాడిలో మరణించిన వారి కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

భూగర్భ జలాల పెంపే లక్ష్యం



నీటి కుంటను తనిఖీ చేస్తున్న ఏపీవో మోషే

పుల్లలచెరువు: గ్రామాల్లో భూగర్భ జలాలు పెంపే లక్ష్యంగా రైతుల పొలాల్లో నీటి కుంటలు నిర్మిస్తున్నట్లు ఏపీవో మోషే తెలిపారు. గురువారం మండల కేంద్రంలో రైతులు ఏర్పాటు చేసుకున్న నీటి కుంటను తనిఖీ చేసి ఆయన మాట్లాడారు. మండలంలోని తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని, దాన్ని అధిగమించేందుకు వర్షాలు పడినప్పుడు రైతుల పొలాల్లో నీరు నిల్వ ఉండేలా ప్రభుత్వం మండలానికి 250 నీటి కుంటలు ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు ఇచ్చిందని, తప్పనిసరిగా నీటి కుంటలు నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉపాధి సిబ్బంది గ్రామాల్లో రైతులకు నీటి కుంటల ఉపయోగాలు తెలిపి వాటిని ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న ప్రతి వేతనదారుడు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రమాద బీమా చేయించుకోవాలని, దానిపై గ్రామాల్లో ఉండే ఉపాధి సిబ్బందిని సంప్రదించాలన్నారు. ఉపాధి పనులు చేసేటప్పుడు కొలతల ప్రకారం పనులు చేస్తే రూ.307 వేతనం అందే అవకాశం ఉందని, ప్రతి వేతనదారుడు ప్రభుత్వ నియమాలు అనుసరించి పనులు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

పదిలో మెరిసిన పేదింటి బిడ్డలు



శెట్టి స్రవంతి



గీతిక

నాగులుప్పలపాడు: చిన్నప్పటి నుంచే తండ్రి ప్రేమాభిమానాలకు దూరమైనా అన్నీ తానై పెంచిన తల్లి కోరికను ఆ కూతురు నెరవేర్చింది. 5వ తరగతిలో ఉండగానే అత్యంత క్లిష్టమైన రెసిడెన్షియల్ పాఠశాలలో 5వ తరగతిలో సీటు సాధించి తల్లికి భారం కాకూడదనుకొని ఊరికి దూరమైనా పాఠశాలలో చేరింది. బుధవారం ప్రకటించిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో అమ్మనబ్రోలు రెసిడెన్షియల్ బాలికల పాఠశాలకు చెందిన శెట్టి స్రవంతి సంతనూతలపాడు నియోజకవర్గస్థాయిలో అత్యధికంగా 586 మార్కులు సాధించింది. యర్రగొండపాలెం మండలం అమానీ గుడిపాడు గ్రామానికి చెందిన శెట్టి చెన్నకేశవులు, కొండమ్మ దంపతులకు మనస్పర్థల కారణంగా కుమార్తె స్రవంతి పుట్టిన నాటి నుంచి ఇద్దరూ దూరంగా ఉంటున్నారు. అయినా కష్టాలకు వెరవని కొండమ్మ వ్యవసాయ కూలీగా పనిచేస్తూ స్రవంతిని పోషిస్తోంది. తల్లి కష్టానికి ప్రతిఫలంగా కుమార్తె పదో తరగతిలో మంచి మార్కులు సాధించింది. భవిష్యత్‌లో సివిల్స్ రాసి ఐఏఎస్ కావాలన్న తన కోరికతో చదువుతానని స్రవంతి తెలిపింది.

కూలీ కుటుంబంలో చదువుల సరస్వతి..

కొత్తపట్నం: కూలీ కుటుంబంలో చదువుల సరస్వతి వెలిసింది. ఈతముక్కల గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థినికి 591 మార్కులు వచ్చినట్లు హెచ్ఎం చెంచు పున్నారావు తెలిపారు. గ్రామానికి చెందిన ఆకురాతి శ్రీహరి, ధరిణి ప్రియ దంపతులు కూలి పనులు చేసుకుంటూ కుమార్తె ఆకురాతి గీతికను చదివిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలకు మంచి పేరు తెచ్చింది. అంతేకాకుండా మండలంలోని ఏడు హైస్కూళ్లలో 591 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు గీతికను అభినందించి స్వీట్లు తినిపించారు.

ఉద్యోగాలకు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

ఒంగోలు సిటీ: కళాశాల ప్రాంగణ ఎంపికల్లో విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల సెక్రటరీ శిద్దా హనుమంతరావు తెలిపారు. గురువారం వల్లూరు సమీపంలోని రైజ్ కృష్ణసాయి గ్రూప్ ఆఫ్ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. ఈసందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ 33 మంది విద్యార్థులు ఫేస్ ప్రెప్ కంపెనీకి ఎంపికయ్యారన్నారు. కంపెనీ తరపున హెచ్‌ఆర్ సుమంత్, ఆనంద్, కళాశాలకు విచ్చేసి విద్యార్థులకు మొదటగా రాతపరీక్ష, గ్రూప్ డిస్కషన్, హెచ్ ఆర్ రౌండ్ నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు వార్షిక వేతనం రూ.3.06 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉంటుందని కళాశాల ప్లేస్‌మెంట్ ఎస్‌వీ రఘుబాబు తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కళాశాల గౌరవ చైర్మన్ ఇస్కాల రంగమన్నార్, ట్రెజరర్ శిద్దా భరత్, రాగా చీఫ్ అడ్వైజర్ శిద్దా ప్రవల్లిక, కళాశాల డైరెక్టరు ఏవీ భాస్కరరావు, తదితరులు అభినందనలు తెలిపారు.

వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



బ్రహ్మోత్సవాల కరపత్రిక ఆవిష్కరిస్తున్న ఈవో నాగేశ్వరరావు, గ్రామస్తులు

మద్దిపాడు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మల్లవరం వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మే 7వ తేదీ నుంచి 17వ తేదీ వరకు నిర్వహిస్తునట్లు దేవస్థాన కార్యనిర్వాహక అధికారి దామా నాగేశ్వరరావు తెలిపారు. గురువారం మల్లవరం వెంకటేశ్వర స్వామి దేవస్థాన ఆవరణంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను గ్రామ పెద్దల సమక్షంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యనిర్వాహక అధికారి మాట్లాడుతూ.. వెంకటేశ్వరస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిగా మే 7వ తేదీన రాత్రి అంకురార్పణతో స్వామివారి బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని 14వ తేదీ స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. సామాజిక వర్గాల వారీగా ఆయా సంఘాల తరపున బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రతిరోజు రాత్రి వివిధ వాహనాలపై శ్రీవారు గ్రామ పురవీధుల్లో విహరిస్తారన్నారు. కార్యక్రమంలో దేవస్థాన ప్రధాన అర్చకులు నారాయణం వెంకటాచార్యులు, నారాయణం రాజశేఖరాచార్యులు, శ్రీవారి వనం కమిటీ అధ్యక్షులు మార్నేని కృష్ణారావు, మల్లవరం గ్రామ పెద్దలు మార్నేని రాఘవేంద్రరావు (రాఘవ), నారిపెద్ది వరహాల చౌదరి, నారిపెద్ది బాబురావు, మార్నేని సుబ్బారావు, పొన్నం వెంకటేశ్వర్లు, నారా నాగిరెడ్డి ముప్పవరపు ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ నిర్మలాదేవి

దొనకొండ: మండలంలోని ఇండ్లచెరువు, గంగదేవిపల్లి గ్రామాల్లో జరుగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులను గురువారం మార్కాపురం క్లస్టర్ ఏపీడీ నిర్మలాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె కూలీలతో మాట్లాడుతూ కొలతల ప్రకారం పని చేసి రోజుకు ప్రభుత్వం ఇచ్చే రూ.307 కూలీ పొందాలని కోరారు. ఉపాధి కూలీలు ప్రతి ఒక్కరూ రూ.20 చెల్లించి ప్రధానమంత్రి సురక్షా బీమా యోజన (పీఎంఎస్‌బీవై) ఇన్సూరెన్స్ చేయించుకోవాలని, ఏమైనా ప్రమాదం జరిగితే రూ.2 లక్షలు బీమా వర్తిస్తుందన్నారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి యోజన (పీఎంజేజేవై) ప్రతి ఒక్కరూ రూ.436 చెల్లిస్తే రూ.3 లక్షల బీమా వర్తిస్తుందని, కూలీలందరూ రెండు రోజుల్లోపు దరఖాస్తులు సంబంధిత ఫీల్డ్ అసిస్టెంట్‌కు అందజేయాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున కూలీలు ఉదయం 5 గంటలకు వచ్చి పనులు చేసుకోవాలని సూచించారు. మండలంలో పశువుల నీటితొట్లను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. కూలీలకు బకాయిలు బుధవారం నుంచి జమ అవుతున్నాయని వివరించారు. ఆమె వెంట ఏపీఓ కళ్యాణి, సిబ్బంది ఉన్నారు.